సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 14 । ఏప్రిల్ । 2024



రైల్వేస్టేషన్లలో సురక్షిత నీరు

వేసవికాలం దృష్ట్యా రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 8లో



స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

ఏయూలోని నూతన తరగతి గదిలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను శనివారం జేసీ. కె.మయూర్ అశోక్ సందర్శించారు. 8లో



ఆ ఐదేళ్లూ.. మట్టిని దోచేశారు

2014–19 మధ్య కాలంలో నీరు – చెట్టు, నీరు – ప్రగతి పథకాలు టీడీపీ నేతలకు ఉపాధి కల్పించి కోటీశ్వరులను చేశాయి. 8లో

వేటకు విరామం

- నేటి అర్ధరాత్రి నుంచి చేపల వేట నిషేధం
- 61 రోజుల పాటు అమలు
- సంప్రదాయ తెప్పలు, పడవలకు మినహాయింపు

మహారాణిపేట: జిల్లాలో ఆదివారం అర్ధరాత్రి నుంచి జూన్ 14వ తేదీ అర్ధరాత్రి వరకు చేపల వేటపై నిషేధం అమలులో ఉంటుంది. వేట విరామంతో 90 శాతం బోట్లు తీరానికి చేరుకున్నాయి. మిగిలిన 10 శాతం బోట్లు ఆదివారం సాయంత్రానికి చేరుకుంటాయని మత్స్యకారులు తెలిపారు. 61 రోజుల్లో సముద్రంలో మత్స్య సంతతి వృద్ధి, సంతాన ఉత్పత్తికి వీలుగా ప్రభుత్వం ఎన్నో ఏళ్ల నుంచి ఈ విరామాన్ని అమలు చేస్తోంది. సముద్రంలో చేపల వేట సాగించే మరబోట్లు, వెసల్స్, ట్రాలర్ల వల్ల మత్స్య సంపదకు హాని కలుగుతుందన్న ఉద్దేశంతో వీటితో వేటను నిషేధించింది. అయితే మోటార్లు లేని సంప్రదాయ తెప్పలు, నాటు పడవలకు మినహాయింపునిచ్చింది. నిషేధ సమయంలో తెప్పలు/పడవలు సముద్ర తీరం నుంచి ఎనిమిది కిలోమీటర్ల లోపు చేపల వేటకు అనుమతిస్తారు.

విశాఖ జిల్లాలో 65 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. 32 మత్స్యకార గ్రామాలు, 15 ఫిష్ లాండింగ్ కేంద్రాలు ఉన్నాయి. సుమారు 51 వేల మత్స్యకార కుటుంబాలు నివసిస్తున్నాయి. 10 వేల మందికిపైగా మత్స్యకారులు సముద్రంలో చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తున్నారు. హార్బర్‌పై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా 50 వేల మందికిపైగా జీవిస్తున్నారు. ఫిషింగ్ హార్బర్ కేంద్రంగా 1,674 బోట్లు, భీమిలి కేంద్రంగా 294 బోట్లపై వేట చేస్తున్నారు. ఇవి కాకుండా 443 సంప్రదాయ తెప్పలు, పడవలు ఉన్నాయి. సంప్రదాయ తెప్పలు, పడవలు తప్పించి.. అన్ని మెకనైజ్డ్, మోటరైజ్డ్ బోట్లకు ఈ నిషేధ చట్టం వర్తిస్తుంది. నిషేధ కాలంలో మత్స్యవేట చేస్తే ఆంధ్రప్రదేశ్ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టం సెక్షన్(4)ను అనుసరించి శిక్షార్హులు. వారి బోట్లు, మత్స్య సంపదను స్వాధీనం చేసుకోవడంతోపాటు జరిమానా విధించే అవకాశం ఉంది. అలాగే ప్రభుత్వం అందిస్తున్న డీజిల్ ఆయిల్ రాయితీ, అన్ని రకాల సౌకర్యాలు నిలుపుదల చేస్తామని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.విజయకృష్ణ హెచ్చరించారు.

విరామ సమయంలో ఇలా..

చేపలవేట విరామ సమయంలో బోటు యజమానులు తమ బోట్లకు మరమ్మతులు చేయించుకుంటారు. ఇంజిన్ గేర్ బాక్సులు, ఆయిల్, వాటర్, కేబిన్, పంఖాలు, బుష్లు వంటి వాటికి రిపేర్లు చేయించుకుని బోటు కండిషన్‌లో ఉంచుకుంటారు. అలాగే వలలకు కూడా మరమ్మతు పనులు చేపడతారు. బోట్లలో వేట క్లే మత్స్యకార సిబ్బంది (క్రూ) స్థానికంగా లభించే పనులకు వెళ్తారు.

ఐదేళ్లలో రూ.61 కోట్ల భరోసా

- టీడీపీ ప్రభుత్వ హయాంలో వేట విరామ సమయంలో రూ.4 వేల చొప్పున ఇచ్చే నిషేధ భృతిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాగానే రూ.10 వేలకు పెంచింది.
- జిల్లా మత్స్యకారులకు టీడీపీ తన ఐదేళ్ల పాలనలో రూ.20 కోట్ల భృతిని అందిస్తే.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.61.02 కోట్లను మత్స్యకార భరోసా కింద అందజేసింది.
- టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు వేట నిషేధ సమయంలో ఇచ్చే అరకొర పరిహారాన్ని ఏడాదికో, రెండేళ్లకో ఇచ్చేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఈ మొత్తాన్ని నిషేధ కాలం ముగియకుండానే ఏటా మేలోనే వారి ఖాతాలకు నేరుగా జమ చేసి మత్స్యకారులకు అండగా నిలిచింది.
- 2019 వరకు కేవలం 318 మందికే డీజిల్ సబ్సిడీ వర్తింపజేయగా.. వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఆ సంఖ్య 550కి పెరిగింది.
- 2014–19 వరకు సుమారు రూ.10 కోట్లు మాత్రమే రాయితీ సొమ్ము ఇవ్వగా.. 2019–24 మధ్య కాలంలో రూ.40 కోట్లు చెల్లించారు.
- టీడీపీ హయాంలో బోట్ల డీజిల్ రాయితీ సొమ్ము కోసం ఏళ్ల తరబడి ఎదురు చూసేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో బోట్లకు డీజిల్ వేయించుకునేటప్పుడే సబ్సిడీ సొమ్మును మినహాయింపునిచ్చారు. డీజిల్ రాయితీ రూ.6 నుంచి 9కి పెరగడం, ముందుగానే సబ్సిడీ మినహాయింపునివ్వడంతో మత్స్యకారులకు ఎంతో లబ్ధి చేకూరింది.



హార్బర్‌లో బోట్లు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఈనెల 14 అర్ధరాత్రి నుంచి జూన్ 14వ తేదీ అర్ధరాత్రి వరకు చేపలవేట నిషేధం అమలులో ఉంటుంది. ఆ సమయంలో ఎవరైనా చేపలవేట సాగిస్తే పట్టుబడిన చేపలను స్వాధీనం చేసుకుంటాం. మత్స్యశాఖ, కోస్ట్ గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ, పోలీస్, నేవీ, రెవెన్యూ అధికారులతో నిరంతరం గస్తీ ఉంటుంది. నిషేధ సమయంలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు.

– ఎం.విజయకృష్ణ, జాయింట్ డైరెక్టర్, మత్స్యశాఖ

నిరసన జ్వాలలు

సీఎం జగన్‌పై దాడిని ఖండిస్తూ ఆందోళనలు



ఎన్‌ఏడీ జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, బి.ఎస్.కృష్ణ, జియ్యాని మారుతి తదితరులు



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, కనక రెడ్డి, వాసర్ల సుబ్రహ్మణ్యం, కొట్యాడ గంగాధర్

సాక్షి, విశాఖపట్నం/సీతమ్మధార/గోపాలపట్నం: బస్సు యాత్రలో భాగంగా విజయవాడ సింగ్‌నగర్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై రాయితో జరిగిన దాడిని ఖండిస్తూ.. శనివారం రాత్రి నగరంలో నిరసనలు వెల్లువెత్తాయి. మేమంతా సిద్ధం బస్సు యాత్రకు అశేష ఆదరణ వస్తుందనే ఆక్రోశంతో చంద్రబాబు ప్రోద్బలంతోనే జరిగిన దాడిగా ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజలు భావించి.. తీవ్రంగా ఖండించారు. చంద్రబాబుకు రాజకీయ సమాధి తప్పదని వైఎస్సార్ సీపీ నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం జగన్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ శనివారం రాత్రి సీతమ్మధారలోని నియోజకవర్గ కార్యాలయం వద్ద కె.కె.రాజు ఆధ్వర్యంలో నిరసన జరిగింది. ప్రజాక్షేత్రంలో సత్తా నిరూపించుకోవాలే గానీ.. ఇలాంటి దాడులు మంచిది కాదని కె.కె.రాజు అన్నారు. ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, వీఎన్ శశికళ, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు పాల్గొన్నారు. ఎన్‌ఏడీ జంక్షన్‌లో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆధ్వర్యంలో, విశాఖ దక్షిణలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కొండా రాజీవ్ గాంధీ ఆధ్వర్యంలో నిరసనలు జరిగాయి.



సీఎం జగన్‌పై దాడిని ఖండిస్తున్న కె.కె.రాజు

సీఎంపై దాడి హేయమైన చర్య



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి అత్యంత హేయమైన చర్య. మేమంతా సిద్ధం సభలకు ప్రజల నుంచి వచ్చిన ఆదరణను చూసి ఓర్వలేక పచ్చమూకలు దాడి చేశాయి. రాజకీయాల్లో సీఎం జగన్‌ను ఎదుర్కోలేక భౌతికదాడులకు దిగడం దారుణం. పోలీసులు పూర్తిస్థాయిలో విచారించి నిందితులపై కఠిన చర్యలు చేపట్టాలి.

– గొలగాని హరి వెంకటకుమారి, మేయర్

ఆదరణను ఓర్వలేక దుశ్చర్య

సీఎం జగన్‌పై దాడి ప్రజలపై చేసిన దాడిగా పరిగణిస్తున్నాం. ప్రజాక్షేత్రంలో ప్రత్యక్షంగా తలపడే దమ్ములేక పిరికిపందల్లాగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి చేశారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాను. సిద్ధం, మేమంతా సిద్ధం బస్సు యాత్రలతో సీఎం జగన్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు.

– వరుదు కల్యాణి, శాసన మండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు

కుట్రలో భాగంగానే ఈ దాడి

ఉద్దేశపూర్వకంగానే చంద్రబాబు అండ్ కో క్యాట్ బాల్‌తో సమయం చూసి ఎత్తయిన బిల్డింగ్ ఉన్న చోట ఎంపిక చేసుకున్నారు. ముందస్తు కుట్రలో భాగంగా ఈ దాడి జరిగిందని భావిస్తున్నాం. సీసీ కెమెరాలకు చిక్కకుండా ముందుగా విద్యుత్ అంతరాయం కల్పించి ఈ దాడికి పాల్పడ్డారు. ఈ కుట్రకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి.

– కొండా రాజీవ్‌గాంధీ, రాష్ట్ర అధికార ప్రతినిధి

న్యూస్‌రీల్

యూసీడీలో ముగ్గురు సీవోల సస్పెన్షన్

ఏపీడీకి షోకాజ్ నోటీస్

అల్లిపురం: యూసీడీపై వచ్చిన ఆరోపణలపై కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున తీవ్రంగా స్పందించారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ నివేదిక ఆధారంగా బాధ్యులందరిపై చర్యలు తీసుకుంటున్నట్లు ఓ ప్రకటనలో వెల్లడించారు. 17, 18, 19వ వార్డుల సీవోలు తిరుమలరావు, నరసింహులు, ఎస్.వి.రమణలను సస్పెండ్ చేశారు. జోన్–3 ఏపీడీ దుర్గాప్రసాద్‌కు షోకాజ్ నోటీసు జారీ చేస్తూ.. ఎన్నికల విధుల నుంచి తొలగించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. వీటికి సంబంధించిన ఆర్పీలను వారి పోస్టుల నుంచి తొలగించినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు.

ఆందోళనకు ఇది సమయం కాదు

గంగవరం పోర్టు కార్మికులతో కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: గంగవరం పోర్టు కార్మికుల సమస్యలపై కలెక్టర్ ఎ.మల్లికార్జున శనివారం.. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కార్మిక సంఘాలతో చర్చించారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉండడం వల్ల ఆందోళనకు ఇది సరైన సమయం కాదని కార్మిక సంఘాలకు సూచించారు. కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లామని, వారు కొంత సమయం కోరారని వారికి వివరించారు. అంతవరకు శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దని సూచించారు. సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ ఎ.రవి శంకర్, గంగవరం పోర్టు సీఈవో అమిత్ మాలిక్, డీసీపీ(శాంతి భద్రతలు) సత్తిబాబు, ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు చంద్రబాబు విశాఖ రాక

మహారాణిపేట : టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదివారం విశాఖ వస్తున్నారు. ప్రజాగళం మూడో దశలో భాగంగా మధ్యాహ్నం 3 గంటలకు పాయకరావుపేటలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో గాజువాక వస్తారు. రాత్రి 7 గంటలకు గాజువాకలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. బహిరంగ సభ తర్వాత విమానంలో చంద్రబాబు తిరిగి హైదరాబాద్ వెళ్తారు.

రాయగడ వరకే విశాఖ–భవానీపట్న పాసింజర్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం–భవానీపట్న–విశాఖపట్నం(08504/08503) పాసింజర్ స్పెషల్‌ను పునరుద్ధరిస్తున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల కోరిక మేరకు ఈ పాసింజర్‌ను రాయగడ వరకు రాకపోకలు సాగించేలా ఏర్పాట్లు చేశామన్నారు. విశాఖపట్నం–భవానీపట్న(08504) పాసింజర్ స్పెషల్ ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు రాయగడ వరకు నడుస్తుంది. ఈ నెల 16 నుంచి 25వ తేదీ వరకు భవానీపట్న–విశాఖపట్నం (08503) పాసింజర్ స్పెషల్ రాయగడ నుంచే బయలుదేరుతుందని వాల్తేర్ డివిజన్ డీసీఎం వెల్లడించారు.

యువతా మేలుకో..

- ఓటరుగా నమోదు చేసుకో..
- ఆఫ్‌లైన్‌లో ఈ రోజు రాత్రి వరకూ అవకాశం

సాక్షి, విశాఖపట్నం/మహారాణిపేట : సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ చివరి నిమిషం వరకూ ఓటు హక్కు నమోదు చేసే అవకాశాన్ని కల్పించింది. ఈ ఏడాది జనవరి 22న తుది ఓటర్ల జాబితాలో విడుదల చేసింది. 18 ఏళ్లు నిండి, ఓటర్ల జాబితాలో పేరులేనివారు ఆఫ్‌లైన్‌లో ఈనెల 14 వరకు, ఆన్‌లైన్‌లో ఈనెల 15 వరకు ఓటు హక్కు నమోదు చేసుకోవచ్చు. విశాఖ జిల్లాలో మొత్తం 25 లక్షలపై చిలుకు జనాభా ఉండగా ప్రస్తుతం 19.42 లక్షల మంది ఓటర్లున్నారు. అంటే 6 లక్షల మంది వరకూ ఓటు హక్కు లేదు. వీరిలో 18 ఏళ్లు నిండని వారు 4 లక్షల మంది ఉన్నారని అనుకుంటే.. సుమారు 2 లక్షల మంది తమ ఓటు హక్కు నమోదు చేసుకోవడంపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. వీరంతా ఈసారైనా ఓటు హక్కు పొందితే.. విశాఖ దశ, దిశ మార్చే కీలక యజ్ఞంలో భాగస్వామ్యులవుతారు. https://voters.eci.gov.in/ వెబ్‌సైట్‌లోనూ, ఓటర్స్ హెల్ప్‌లైన్ యాప్‌తో పాటు గ్రేటర్ పరిధిలోని అన్ని మున్సిపల్ కార్యాలయాల్లోనూ, జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లోనూ ఫారం–6ని సమర్పించి ఓటు హక్కు పొందేందుకు అవకాశం ఉంది. ఎన్నికలకు ముందు చివరి సారిగా ఓటరు జాబితా సవరణ జరుగుతున్న నేపథ్యంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదై ఉండాలి.

బీఎల్‌ఓల వద్ద..

ఓటర్ల జాబితా బూత్ లెవల్ అధికారి (బీఎల్‌వో) వద్ద అందుబాటులో ఉంది. ఓటు హక్కు ఉన్నది లేనిది సరి చూసుకోవచ్చు. జాబితాలో పేరు లేనివారు బీఎల్‌ఓ వద్ద గానీ, ఆన్‌లైన్‌లో గానీ దరఖాస్తు చేసుకుంటే వారికి ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం కల్పించేందుకు చర్యలు చేపడతామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఓటరు నమోదు ఇలా....

ఓటరుగా నమోదు చేసుకునేందుకు యువత పోలింగ్ కేంద్రాల పరిధిలోని బీఎల్‌వోల వద్ద ఉండే ఫారం–6ను నింపి అందుకు కావాల్సిన పత్రాలను అందించాలి. ఒకవేళ బీఎల్‌వోలు అందుబాటులో లేకుంటే తహసీల్దార్ కార్యాలయాల్లో కానీ, ఇంటర్‌నెట్ ద్వారా కానీ నమోదు చేసుకోవచ్చు. దరఖాస్తుకు ఒక ఫొటో, వయస్సు నిర్ధారణ పత్రం, చిరునామా ధ్రువీకరణ ఉండే విద్యుత్, కుళాయి, ఇంటి బిల్లులు వంటివి జతచేయాలి.



నియోజకవర్గం	జనవరి 22 నాటికి ఓటర్లు	కొత్తగా చేరిన ఓటర్లు	11 ఏప్రిల్ నాటికి ఓటర్లు	పెరిగిన ఓటర్ల శాతం
భీమిలి	351462	8429	359954	2.42
విశాఖ తూర్పు	276523	12997	289520	4.70
విశాఖ దక్షిణ	210131	4567	214698	2.17
విశాఖ ఉత్తర	274760	8579	283339	3.12
విశాఖ పశ్చిమ	206943	4549	211492	2.20
గాజువాక	323671	7313	330984	2.26
పెందుర్తి	299103	6560	305663	2.19
మొత్తం	1942593	53057	1995650	2.73

మీ హక్కు కోల్పోవద్దు



18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు తప్పనిసరిగా పొందాలని కోరుతున్నాం. ఆఫ్‌లైన్‌లో ఆదివారం రాత్రిలోగా, ఆన్‌లైన్‌లో 15లోగా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తాం. 15 తర్వాత వచ్చిన దరఖాస్తుల్నీ కూడా పరిగణనలోకి తీసుకుంటాం. కానీ.. అవి ఓటర్ల జాబితాలో ఉండే అవకాశాలుండవు. వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి ఓటర్ల జాబితాలో చేర్చేందుకు యత్నిస్తున్నాం. ఓటరు నమోదుకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం 1950 టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

– డా.మల్లికార్జున, జిల్లా ఎన్నికల అధికారి

బీహెచ్‌పీవీకి పునరుజ్జీవం

- వైఎస్సార్ సూచనతో లోక్‌సభలో ప్రస్తావించిన బొత్స ఝాన్సీ



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీ లక్ష్మి ఉన్నత విద్యావంతురాలు. 2006లో బొబ్బిలి లోక్‌సభ సభ్యురాలిగా, 2009లో విజయనగరం ఎంపీగా గెలుపొందారు. ప్రస్తుత ఎన్నికల్లో విశాఖ ఎంపీగా పోటీ చేస్తున్న ఆమె.. 2009లోనే 'విశాఖ విజన్' పేరిట నగర అభివృద్ధిపై ఆమె పార్లమెంట్‌లో పలు అంశాలు ప్రస్తావించారు. భారీ పరిశ్రమల మనుగడే దేశ ప్రగతికి దోహదం చేస్తాయని నమ్మిన బొత్స ఝాన్సీలక్ష్మి.. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని జాతి ప్రయోజనాల పరిరక్షణ కోసం వినియోగించారు. అప్పటి వైఎస్సార్ ప్రభుత్వం బీహెచ్‌పీవీ పునరుజ్జీవానికి చేసిన ప్రయత్నాల్లో బొత్స ఝాన్సీ కూడా తన పాత్ర పోషించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సూచనల మేరకు విశాఖ పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి కారణమైన భారీ పరిశ్రమ బీహెచ్‌పీవీ పునఃవైభవం కోసం పార్లమెంట్‌లో బొత్స ఝాన్సీ ప్రస్తావించారు. 2007 సెప్టెంబర్ 7న లోక్‌సభలో అన్‌స్టార్డ్ క్వశ్చన్ 3227ను బీహెచ్‌పీవీ పునరుద్ధరణ ప్యాకేజీ కావాలని అడిగారు. దీనిపై కేంద్రం తీసుకుంటున్న చర్యలను కూడా ఆమె ప్రశ్నించారు. దీనిపై అప్పటి కేంద్రం భారీ పరిశ్రమల మంత్రి సంతోష్ మోహన్ దేవ్ సమాధానం ఇచ్చారు. బీహెచ్‌ఈఎల్‌లో బీహెచ్‌పీవీ విలీనానికి సంబంధించి కేంద్రానికి ప్రతిపాదన వచ్చిందన్నారు. ఏపీ ప్రభుత్వం భూమిని గిఫ్ట్ డీడ్ కింద ఇచ్చేందుకు అంగీకరించిందన్నారు. బ్యాంకర్లతో రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ మాఫీ, రుణ మొత్తం సెటిల్‌మెంట్‌పై జరిపిన చర్చలు ఓ కొలిక్కి వచ్చాయని జవాబు ఇచ్చారు. అలాగే 2009లో జూలై 3న లోక్‌సభలో అన్ స్టార్డ్ క్వశ్చన్ 258ను బీహెచ్‌ఈఎల్, ఎన్‌టీపీసీ జాయింట్ వెంచర్ ప్రాజెక్ట్‌కు ఏపీ ప్రభుత్వం 750 ఎకరాల భూమిని ఇచ్చింది కదా.? ఎప్పుడు ప్రాజెక్ట్ ప్రారంభిస్తారని ప్రశ్నించారు. దీనికి కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి భరత్ సింహ్ సోలంకి సమాధానం కూడా ఇచ్చారు. 2009 జూలై 9న లోక్‌సభలో అన్‌స్టార్డ్ క్వశ్చన్ 856ను బీహెచ్‌ఈఎల్‌లో ప్రభుత్వం 10 శాతం వాటాను ఉపసంహరించుకునే ఆలోచన చేస్తుందా? అని ప్రశ్నించారు. దీనికి కేంద్ర భారీ పరిశ్రమలు పబ్లిక్ ఎంటర్‌ప్రైజస్ మంత్రి అరుణ్ రాయ్ సమాధానం ఇచ్చారు. రైల్వేతో స్టెయిన్‌లెస్ స్టీల్ ఈఎంయూ కోచ్‌లు సరఫరా ఒప్పందం రైల్వే బోర్డు పరిధిలో ఉందన్నారు. బీహెచ్‌ఈఎల్‌లో ప్రభుత్వ వాటా ఉపసంహరణ నిర్ణయం ఏదీ లేదని స్పష్టం చేశారు.

18 నుంచి అప్పన్న వార్షిక కల్యాణోత్సవాలు



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాలు ఈనెల 18 నుంచి 24 వరకు జరగనున్నాయి. ఇందుకు దేవస్థానం అధికార, వైదికులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 18న రాత్రి 7 గంటల నుంచి మృత్సంగ్రహణం, అంకురార్పణ నిర్వహించనున్నారు. 19 మధ్యాహ్నం 3 గంటలకు కొట్నాలు ఉత్సవం, సాయంత్రం 6.30 గంటల నుంచి ఎదురుసన్నాహోత్సవం, రాత్రి 8.15 గంటల నుంచి రథోత్సవం, రాత్రి 10.30 గంటల నుంచి వార్షిక కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. 20న సాయంత్రం 5 గంటల నుంచి శేషవాహనంపై తిరువీధి, రాత్రి 7 గంటలకు విశేష హోమాలు నిర్వహిస్తారు. 21న ఉదయం 7.30 గంటల నుంచి వైదిక సదస్యం, సాయంత్రం 3.30 గంటల నుంచి పండిత సదస్సు, సాయంత్రం 6 గంటల నుంచి సర్వజన మనోరంజనపై తిరువీధి నిర్వహిస్తారు. 22న సాయంత్రం 5 గంటల నుంచి సూర్యప్రభ వాహనంపై తిరువీధి నిర్వహిస్తారు. 23న ఉదయం 6.30 గంటల నుంచి పూర్ణాహుతి, చూర్ణోత్సవం, వసంతోత్సవం, అవబృదోత్సవం(చక్రస్నానం), రాత్రి 7 గంటల నుంచి మృగయోత్స వం నిర్వహిస్తారు. 24న ఉదయం 8 గంటల నుంచి వినోదోత్సవం, సాయంత్రం 6గంటల నుంచి శ్రీపుష్పయాగం, ఉయ్యాలసేవ నిర్వహించనున్నారు.

ప్రధాన సెషన్స్ కోర్టు పీపీగా జగదీశ్వరరావు



విశాఖ లీగల్: విశాఖ జిల్లా ప్రధాన సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు.. రెండో అదనపు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఆయన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాండ్రేగుల జగదీశ్వరరావు గత 26 సంవత్సరాలుగా విశాఖ బార్ అసోసియేషన్‌లో న్యాయవాది వృత్తిలో కొనసాగుతున్నారు.

వంశీకృష్ణా.. నీ ఓటమి ఖాయం

విశాఖ దక్షిణ జనసేన నాయకుడు సాధిక్



డాబాగార్డెన్స్: విశాఖ దక్షిణ నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ ఓడిపోవడం ఖాయమని జనసేన నాయకుడు, 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ స్పష్టం చేశారు. సర్వేలు కూడా వంశీకృష్ణకు అనుకూలంగా లేవని, ప్రజలు కూడా ఆయన్ని నాన్‌లోకల్ గానే భావిస్తున్నారని తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వంశీకృష్ణ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయకుండా జనసేనలో చేరిన తర్వాత వైఎస్సార్ సీపీ నాయకులను టార్గెట్ చేసి సస్పెండ్ అయ్యేలా స్కెచ్ వేశారని ఆరోపించారు. పార్టీ మారినందున గత నెల 12న సస్పెండ్ చేశారని, ఈ నెల 4న ఎమ్మెల్సీ పదవి కోసం కోర్టును ఆశ్రయించినట్టు చెప్పారు. దక్షిణ నియోజకవర్గ కూటమి అభ్యర్థి అని ప్రకటించుకున్న మరుసటి రోజే కోర్టును ఆశ్రయించడం విడ్డూరంగా ఉందన్నారు. సానుభూతి కోసం పవన్ కల్యాణ్‌ను వంశీకృష్ణ మోసం చేశారని.. ఈ విషయాన్ని పార్టీ అధిష్టానానికి వివరించినట్టు చెప్పారు. నియోజకవర్గంలో మైనార్టీ వ్యక్తినైన తనకు టికెట్ ఇస్తే విజయం సాధిస్తానన్నారు. వంశీకృష్ణ కుట్ర చేసి టికెట్ సాధించాడని ఆరోపించారు. ఆయన ప్రకాశం జిల్లా నుంచి వ్యాపారం కోసం విశాఖ వలస వచ్చారని గుర్తు చేశారు. వంశీ తనను బెదిరించడం హాస్యాస్పదమని, ఇలా అయితే ముస్లిం వీధుల్లో తిరగగలవా? అని ప్రశ్నించారు. కార్పొరేటర్ కందుల నాగరాజు ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తారని, మూగి శ్రీనివాసరావు పార్టీకి రాజీనామా చేసే యోచనలో ఉన్నారని ఓ ప్రశ్న కు సమాధానమిచ్చారు. సూరాడ తాతారావు, అర్జిల్ల మసేను, మశ్రుల్లా ఖాన్, ఎండీ సలీం, బుకారీ ఖాన్, మోతిభాయ్, రాగతి భాను, పి.రమ, షేక్ అబిదా, కనకమహాలక్ష్మి, బొడ్డు అప్పారావు పాల్గొన్నారు.

రాళ్లతో కొట్టి యువకుడి దారుణహత్య

- వివాహేతర సంబంధమే కారణమా?
- మృతదేహాన్ని పరిశీలించిన సీపీ రవిశంకర్



కాలువలో అమర్ మృతదేహం



ఆరిలోవ: ఆరిలోవ పరిధిలో ఓ యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. గుర్తు తెలియని వ్యక్తులు అతని ముఖం, చేతులపై కిరాతకంగా రాళ్లతో కొట్టి చంపేశారు. వివాహేతర సంబంధమే హత్యకు కారణమై ఉంటుందని స్థానికులు అనుమానిస్తున్నారు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 13వ వార్డు పరిధి శ్రీకృష్ణాపురం శ్మశానం రోడ్డు పక్కన కాలువలో మృతదేహం ఉన్నట్లు శనివారం ఉదయం పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. సీఐ జి.గోవిందరావు, ఎస్ఐలు, సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని.. మృతదేహాన్ని పరిశీలించారు. మృతి చెందింది అదే వార్డు పరిధి దుర్గాబజార్ సమీపం వెర్నిదుర్గానగర్‌కు చెందిన ధనాల అమరేశ్వర్ అలియాస్ అమర్(35)గా పోలీసులు గుర్తించారు. అమర్‌ను కాలువలోకి నెట్టేసి చనిపోయినంత వరకు ముఖం, చేతులపై రాళ్లతో కొట్టి చంపి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. రాళ్ల దెబ్బలకు ముఖం బాగా ఉబ్బిపోయి గుర్తు పట్టలేని విధంగా మారిపోయింది. సమాచారం అందుకున్న నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్, ద్వారకా ఏసీపీ జయరాం ప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ మృతదేహాన్ని, సంఘటన జరిగిన తీరును సీపీ పరిశీలించారు. అనంతరం డాగ్ స్క్వాడ్, క్లూ టీంలను రప్పించారు. పోలీస్ జాగిలం మృతదేహం ఉన్న ప్రాంతం నుంచి కొంత దూరంలో ఖాళీ మద్యం బాటిళ్లు ఉన్న చోటుకు తీసుకెళ్లింది. అనంతరం చుట్టు పక్కల మరి కొన్ని ప్రాంతాలకు తీసుకెళ్లింది. దీని బట్టి మద్యం మత్తులో.. ఈ ఘటన జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం నుంచి రక్తం కారుతుండడాన్ని బట్టి శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ హత్య జరిగి ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సీపీ రవిశంకర్ తెలిపారు.

రాత్రి 8 గంటల తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్

అమర్ కుమారుడి పుట్టినరోజు వేడుకలు శుక్రవారం జరిగాయి. కేకు కట్ చేసిన తర్వాత కొంతసేపటికి ఇంటి నుంచి అమర్ బయటకు వెళ్లిపోయాడు. రాత్రి 8 గంటలకు కుటుంబ సభ్యులు అమర్‌కు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని వచ్చింది. అప్పటి నుంచి శనివారం ఉదయం వరకు ఎన్ని సార్లు ఫోన్ చేసినా స్పందన లేదు. పోలీసుల ద్వారా సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని అమర్ మృతదేహాన్ని చూసి రోదించారు. కాగా.. మృతదేహం వద్ద అమర్ సెల్ ఫోన్ లభించలేదు. హత్య చేసిన వారే ఆ సెల్ ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేసి పట్టుకుపోయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. అమర్ చేతికి ఉన్న డిజిటల్ వాచ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ వాచ్‌లో ఫోన్ కాల్స్‌కు సంబంధించిన డేటా, ఫొటోలను విశ్లేషిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా.. పోలీస్ స్టేషన్, ఇతర వ్యవహారాల్లో అమర్ సెటిల్‌మెంట్ చేసేవాడని స్థానికులు చెబుతున్నారు. నిందితుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. 2021లో జరిగిన జీవీఎంసీ ఎన్నికల్లో 13వ వార్డు స్వతంత్ర్య అభ్యర్థిగా తన భార్యను పోటీలో నిలిపాడు. గ్యాస్ సిలిండర్ గుర్తుపై పోటీ చేసిన ఆమెకు సుమారు 180 ఓట్ల వరకు వచ్చాయి.

పోలీసుల అదుపులో నిందితులు?

అమర్ హత్యకు వివాహేతర సంబంధమే కారణం అయి ఉంటుందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పెందుర్తి ప్రాంతానికి చెందిన ఓ మహిళతో అమర్‌కు వివాహేతర సంబంధం ఉన్నట్లు తెలిసింది. ఆ మహిళ భర్త ఓ రౌడీషీటర్ కావడంతో మాటువేసి శుక్రవారం పథకం ప్రకారం అమర్‌ను హత్య చేసి ఉంటాడని విశ్వసనీయ సమాచారం. పోలీసులు ఇదే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. దీనికి సంబంధించిన రౌడీషీటర్‌తో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పూర్తి దర్యాప్తు అనంతరం ఈ ఘటనపై వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

రైల్వేస్టేషన్లలో సురక్షితమైన తాగునీరు

తాటిచెట్లపాలెం : వేసవికాలం దృష్ట్యా ప్రయాణికులకు సురక్షితమైన తాగునీరు అందుబాటులో ఉంచాలని రైల్వే మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఆయా డివిజన్ల పరిధిలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈస్ట్‌కోస్ట్‌రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో కూడా శుద్ధి చేసిన తాగునీరు ప్రయాణికులకు అందజేసేందుకు కూలర్లు ఏర్పాటు చేశారు. అన్ని ప్లాట్‌ఫారాల్లో తాగునీరు అందుబాటులో ఉంచుతున్నట్లు అధికారులు తెలిపారు. ఆయా సమయాల్లో స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో, స్కౌట్స్ అండ్ గైడ్స్, మహిళా సమితిల సహకారంతో పలు రైళ్ల జనరల్ కోచ్‌ల వద్ద ప్రయాణిలకు తాగునీరు అందించే ఏర్పాట్లు చేశామన్నారు. నీటి కొరత ఉన్న స్టేషన్‌లలో ఆయా రాష్ట్రాలు, పురపాలక సంఘాల సహకారం తీసుకుంటున్నామన్నారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

మహారాణిపేట: ఆంధ్రా యూనివర్సిటీలోని నూతన తరగతి గదిలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను శనివారం జాయింట్ కలెక్టర్, 'విశాఖ తూర్పు'రిటర్నింగ్ అధికారి కె.మయూర్ అశోక్ సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులకు జేసీ పలు సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను వారికి వివరించారు.

ఆ ఐదేళ్లూ... మట్టిని దోచేశారు

- 2014 – 2019 మధ్య టీడీపీ నాయకుల దోపిడీ
- నీరు – చెట్టు పేరుతో భారీ గోల్‌మాల్
- ఇష్టారాజ్యంగా సొమ్ము చేసుకుని పంచుకున్న నాయకులు



తాటితూరు చిల్లవాని చెరువు నుంచి యంత్రాలతో మట్టి తరలించిన దృశ్యం (ఫైల్)

తగరపువలస : చంద్రబాబు అధికారంలో ఉన్న 2014 – 2019 మధ్య ఐదేళ్ల కాలంలో అప్పటి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నీరు – చెట్టు, నీరు – ప్రగతి పథకాలు టీడీపీ నేతలకు ఉపాధి కల్పించి కోటీశ్వరులను చేశాయి. అన్నదాతలకు అవసరం లేకపోయినప్పటికీ ఈ పథకాలు సాగునీటి సంఘాలు, జన్మభూమి కమిటీలు, ఇటుక బట్టీల యజమానులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఫలహారంగా మారాయి. భూగర్భజలాలు పెంపొందించేందుకు నీటి పారుదల శాఖ, ఉపాధి హామీ పథకాల ద్వారా అప్పటి ప్రభుత్వం కోట్లాది రూపాయలు విడుదల చేసింది. ఈ పథకాల ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులన్నీ అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు స్వాహా చేసినట్టు ఆరోపణలు వినిపించాయి. తర్వాత మట్టి విక్రయించగా వచ్చిన మొత్తాలను మూడు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు వాటాలు వేసుకోవడంలో తేడాలు రావడంతో ఎక్కడికక్కడ రచ్చకెక్కారు. వీరికి అప్పటి ఇరిగేషన్ శాఖ అధికారి బహిరంగంగానే సహకరించారు. మరికొందరు అధికారులను బెదిరించి పప్పు బెల్లాల్లా టీడీపీ నాయకులు పంచేసుకుని రైతుల నోట్లో మట్టి కొట్టారు. పంట పొలాలను, చెరువు గట్లను బలహీనపరిచారు. భీమిలి నియోజకవర్గంలో ముఖ్యంగా పాండ్రంగి కాటమయ్య చెరువు, మజ్జిపేట మల్లయ్య బంద చెరువు, ఆనందపురంలోని మర్రి చెరువు, శొంఠ్యాం పెద్ద చెరువు, శింగనబందలోని తుమ్మల చెరువు, తాటితూరులోని చిల్లవాని చెరువు, పెద్ద చెరువు, మర్రి బంద చెరువు, తుమ్మల చెరువులు, దాకమర్రిలోని ఇల్లం దేవి, కోమటివాని, మొకరవాని చెరువులు అప్పటి, ఇప్పటి టీడీపీ నాయకులకు కాసులు కురిపించాయి.

తిలా పాపం.. తలా పిడికెడు..

ప్రభుత్వం కోట్లాది రూపాయలు కుమ్మరించి తవ్వితీసిన క్యుబిక్ మీటర్ మట్టిని దూరాన్ని బట్టి రైతులకు సరఫరా చేయాల్సి వుండగా అప్పట్లో అలా జరగలేదు. బడా వ్యాపారులు రాత్రికి రాత్రి పక్క జిల్లాలు, ఒడిశా నుంచి లారీలు, యంత్రాలతో చెరువులపై వాలిపోయారు. ఇటుక బట్టీలు, రియల్ ఎస్టేట్ భూములకు మట్టిని తరలించడానికి లారీకి రూ.2వేలు వంతున అప్పట్లో వసూలు చేశారు. ఇందులో లారీ కిరాయికి రూ.700, మట్టికి రూ.1300 వంతున లెక్కలు చెప్పారు. జేసీబీలతో మట్టిని లారీల్లో నింపడానికి అదనంగా రూ.300 వంతున వసూలు చేశారు. అప్పట్లో లాభసాటి అయిన ఈ వ్యాపారం కోసం పలువురు ప్రజాప్రతినిధులు సొంతంగా జేసీబీలు కొనుగోలు చేసి ఎకరా రియల్ ఎస్టేట్ భూమిని మట్టితో నింపడానికి రూ.12 లక్షల నుంచి రూ.20 లక్షల వంతున వసూలు చేశారు. నియోజకవర్గంలో నీరు – చెట్టు పనుల్లో గోల్‌మాల్ జరిగిన వివరాలు ఇలా ఉన్నాయి.

- 2015 – 16లో 65 పనులకు సంబంధించి 5 లక్షల క్యుబిక్ మీటర్ల మట్టి తవ్వకాలు జరపగా ప్రభుత్వం రూ.4.60 కోట్లు ఖర్చు చేసింది.
- 2016 – 17లో 490 పనులకు సంబంధించి 89 లక్షల క్యుబిక్ మీటర్ల మట్టి తవ్వకాల కోసం ప్రభుత్వం రూ.35 కోట్లు ఖర్చు చేసింది.
- 2017 – 18లో 172 పనులకు సంబంధించి 1.10 కోట్ల క్యుబిక్ మీటర్ల మట్టి తవ్వకాల కోసం ప్రభుత్వం రూ.39 కోట్లు ఖర్చు చేసింది.



మట్టి తరలింపునకు శింగనబంద చెరువులో గ్రావెల్‌తో వేసిన రహదారి (ఫైల్)



పద్మనాభం మండలం పొట్నూరు చెరువు నుంచి మట్టి తరలించిన దృశ్యం (ఫైల్)